అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ విక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కామారెడ్డి, మార్చి 18 : ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు అంగన్‌వాడీ టీచర్లు 48 గంటలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించి ఉద్యోగం పర్మినెంట్ చేయాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్‌లోకి వెళ్తుంటే పోలీసులు బారికేడ్లు పెట్టి అడ్డగించారు. పోలీసులు, యూనియన్ నాయకులకు వాగ్వాదం చోటుచేసుకోవడంతో అదనపు కలెక్టర్ విక్టర్ స్వయంగా వచ్చి మాట్లాడారు. అనంతరం ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భిక్కనూరు, మార్చి 18 : ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం అనంత్ (23) నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు తన స్నేహితురాలితో కలిసి మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారి 44పై ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొనడంతో అనంత్ అక్కడిక్కడే మృతి చెందగా, వెనకాల కూర్చున్న సంజనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

మాచారెడ్డి, మార్చి 18 : అంగవైకల్యంతో బాధపడుతున్న మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఎల్లంపేట గ్రామానికి చెందిన బానోత్ పద్మ (43) అంగవైకల్యంతో బాధపడుతుండగా ఇటీవల కాలు విరిగింది. దీంతో మనస్థాపం చెంది ఈ నెల 15న ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ సిరిసిల్ల ప్రభుత్వ దవాఖానలో మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. తల్లి బానోత్ గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'రాజీవ్ యువ వికాసం అర్హులకు అందేనా'

బాన్సువాడ, మార్చి 18 : రాజీవ్ యువ వికాసం అర్హులకు అందేనా, అర్హుల ఎంపిక ప్రక్రియలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎందుకని బీసీ సంఘం రాష్ట్ర యువజన కార్యదర్శి, తెలుగునాడు స్టూడెంట్ యూనియన్ నాయకుడు పుట్ట భాస్కర్ ఘాటుగా విమర్శించారు. బాన్సువాడలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం పథకం అర్హులకు అందకపోతే ఎన్ని పథకాలు వచ్చినా వృథా అని, అనర్హులకే పథకం వర్తింపజేసిన ప్రజా ప్రతినిధులకు ఏ శిక్ష వేస్తారో కూడా ప్రభుత్వం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియను కలెక్టర్, మండల స్థాయిలో ఎంపీడీవో, తహసీల్దార్లకు అప్పగించాలని, ప్రజాప్రతినిధులను భాగం చేయకూడదని కోరారు. సమావేశంలో సాయిలు. శ్రీకాంత్, నందు, సోమేశ్, నిఖిల్, బాలు ఉన్నారు.

అంకిత భావంతో పని చేయాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, మార్చి 18 : ఉద్యోగులు అంకిత భావంతో పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం తన ఛాంబర్‌లో స్టాఫ్ నర్సులు, వాక్సిన్ కోల్డ్ చైన్ మేనేజర్లకు కాంట్రాక్ట్ పద్ధతిన నియామకపు ఉత్తర్వులను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్టు పద్ధతిన 26 మందికి వాక్సిన్, కోల్డ్ చైన్ మేనేజర్‌గా ఒకరికి నియామక పత్రాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్, సబ్ కమిటీ ఆఫీసర్ చలపతి తదితరులు పాల్గొన్నారు.

నివేదికలు స్పష్టంగా సమర్పించాలి

లే అవుట్లు, ప్లాట్ల అనుమతులకు సంబంధిత శాఖల అధికారుల నివేదికలు స్పష్టంగా సమర్పించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. జిల్లాలో లే అవుట్లు, ప్లాట్ల అనుమతులకు ఆయా శాఖల అధికారుల నివేదికలు అందజేయాలని అన్నారు. ఆయా లే అవుట్లను సంబంధిత అధికారులు పరిశీలించి పూర్తి నివేదికలు అందజేయాలని తెలిపారు. రెవెన్యూ, విద్యుత్, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, నీటిపారుదల, మున్సిపల్, టౌన్ ప్లానింగ్ తదితర శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్, పంచాయతీరాజ్ ఈఈ దుర్గాప్రసాద్, రోడ్డు భవనాల శాఖ ఈఈ రవిశంకర్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, డీటీసీ పీవో సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కామారెడ్డి, మార్చి 18 : జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్న కమాండ్ కంట్రోల్‌ను ఎస్పీ రాజేశ్‌చంద్ర మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణ కోసం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అన్నీ జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేసినట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్యను తగ్గించే చర్యలో భాగంగా ఉన్నత న్యాయస్థానం, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జాతీయ రహదారి ఎన్‌హెచ్ 44పై స్పీడ్ లిమిట్ 80 చేయడమైందని తెలిపారు.

ధాన్యం పూర్తిగా ఎండిన తర్వాతే కోయాలి

నస్రుల్లాబాద్, మార్చి 18 : ధాన్యం పూర్తిగా ఎండిన తర్వాతనే కోతలు మొదలు పెట్టాలని డీసీవో రామ్మోహన్‌రావు రైతులకు సూచించారు. బీర్కూర్ మండలంలోని బరంగేడ్గి గ్రామంలో రైతులు కోసిన వరి పంటను ఆయన మంగళవారం పరిశీలించారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామన్నారు. ఆయన వెంట డీఎస్‌వో మల్లి కార్జున రావు, డీఎం రాజేందర్ ఉన్నారు.

ఏపీఎం, సీసీలకు అవగాహన

కామారెడ్డి రూరల్, మార్చి 18 : కామారెడ్డి మండల సమాఖ్య కార్యాలయంలో మానవ అక్రమ రవాణా నిరోధకతపై ఎనిమిది మండలాల ఏపీఎంలు, సీసీలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. శిక్షణను డీపీఎం (మానవ అభివృద్ధి విభాగం) రమేశ్‌బాబు, టీవోటీలు రాజేందర్, జగదీశ్‌కుమార్, శ్రీనివాస్, అన్నపూర్ణ, గీత శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో మురళీకృష్ణ, ఏపీఎంలు ప్రసన్న రాణి, శ్రీనివాస్, శ్రీనివాస్, రాజు, శిరీష, గంగాధర్, మోయిజ్, సీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

కామారెడ్డి, మార్చి 18 : జిల్లా కేంద్రంలోని ఆర్‌కే డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జేసీఐ స్ఫూర్తి ఆధ్వర్యంలో ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీకింగ్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి, జేసీఐ స్ఫూర్తి అధ్యక్షురాలు నవనీత, జోన్ ట్రైనర్ రాజు, జేసీఐ ఉపాధ్యక్షుడు సదాశివరెడ్డి, ప్రిన్సిపాళ్లు సైదయ్య, దత్తాద్రి, అకడమిక్ డీన్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

నస్రుల్లాబాద్, మార్చి 18 : విద్యార్థి దశ నుంచే బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సబ్‌కలెక్టర్ కిరణ్మయి అన్నారు. నస్రుల్లాబాద్ మండలం నెమ్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం నెమ్లి వెల్‌నెస్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. నాచుపల్లి నర్సరీని పరిశీలించి మొక్కలు ఎండి పోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో సూర్యకాంత్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

నెమ్లిలో ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కిరణ్మయి

సౌత్ క్యాంపస్‌లో సోషల్ వర్క్ దినోత్సవం

భిక్కనూరు, మార్చి 18 : టీయూ సౌత్ క్యాంపస్‌లో సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో సోషల్ వర్క్ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్డ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మల్లవరపు ప్రసాద్ ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మార్చి మూడో వారం ప్రపంచ సోష ల్ వర్క్ దినోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. న్యాయ సేవా సంస్థ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా నాయసేవాధికారి నాగరాణి శిబిరాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, సోషల్ వర్క్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ వీర భద్రమ్, సోషల్ వర్క్ విభాగం అధ్యాపకులు, హాస్టల్ వార్డెన్ యాలాద్రి, నర్సయ్య, రమాదేవి, సంతోష్ గౌడ్, వివిధ విభాగాల అధ్యాపకులు లలిత, హరిత, ఏపీఆర్‌వో సరిత, నారాయణ, కనకయ్య, రమేశ్, పరిశోధక విద్యార్థి సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయాలి

కామారెడ్డి, మార్చి 18 : జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు చేస్తున్న నిరసన దీక్షలు మంగళవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు.

కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్, వెంకటరాములు, సీనియర్ నాయకులు సాయిలు, బాలయ్య, లక్ష్మణ్, అంజయ్య, నారాయణ, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

నస్రుల్లాబాద్, మార్చి 18 : పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని డీఈవో రాజు ఉపాధ్యాయులను ఆదేశించారు. నస్రుల్లాబాద్ మండలం నెమ్లి గ్రామంలోని పరీక్షా కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. వేసవి కాలం దృష్టిలో పెట్టుకుని కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని అన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి, మార్చి 18 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం మొత్తం 38 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్-2కు మొత్తం జనరల్ 7,140 మందికిగాను 6,999 మంది హాజరుకాగా 141 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. ఒకేషనల్ 1,283 మందికిగాను 1,244 మంది హాజరుకాగా 39 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా కమలాకర్‌రెడ్డి

మాచారెడ్డి, మార్చి 18 : మండలంలోని చుక్కాపూర్ ఆలయ కమిటీ చైర్మన్‌గా కమలాకర్‌రెడ్డి నియమితులయ్యారు. మంగళవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నుంచి నియామకపత్రం అందుకున్నాడు. చైర్మన్‌తోపాటు డైరెక్టర్లను నియమించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆయన చైర్మన్‌గా పనిచేశాడు.

పాల్వంచ తహసీల్దార్ బదిలీ

మాచారెడ్డి, మార్చి 18 : పాల్వంచ తహసీల్దార్ జయంత్‌రెడ్డి బదిలీ అయ్యారు. పాల్వంచ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జయంత్‌రెడ్డి కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. పాల్వంచకు హిమబిందు తహసీల్దార్‌గా రానున్నారు. బుధవారం విధుల్లో చేరనున్నారు.

పొలాల నుంచి మోటర్ చోరీ

మాచారెడ్డి, మార్చి 18 : పాల్వంచకు చెందిన గాలి బోదయ్య పంట పొలం నుంచి మోటర్, వైర్ చోరీకి గురైనట్లు బాధితుడు మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చోరీ వస్తువుల విలువ దాదాపు రూ.16 వేల వరకు ఉంటుందని, పంట పొలాల వద్ద అనుమానాస్పందంగా కనిపించినట్టయితే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

21న రాజంపేట తైబజార్ వేలం

రాజంపేట్, మార్చి 18 : మండల కేంద్రంలో తైబజార్ వేలాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు గ్రామ కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. 2025-26 సంవత్సరానికిగాను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో ఆధ్వర్యంలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని ఒక ప్రకటనలో తెలిపారు.

తాగునీటి సమస్యను

పరిష్కరించిన అధికారులు

ఎల్లారెడ్డిరూరల్, మార్చి 18: 'తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలి' అనే శీర్షికన ఈనెల 4న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. పట్టణంలోని రెండో వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించారు. కొద్ది కాలంగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను అధికారులు మంగళవారం క్లియర్ చేశారు. వాడుకలో లేని బోరుకు మరమ్మతులు చేసి ప్రస్తుతం ఉన్న బోరుకు అనుసంధానం చేయడంతో నీటి సప్లయ్ మెరుగుపడింది. నీటి సమస్య తీవ్రరూపం దాల్చకముందే నమస్తే తెలంగాణ దినపత్రికలో రావడం..అధికారులు సకాలంలో స్పందించడంతో వార్డు ప్రజలు నమస్తే తెలంగాణ దినపత్రిక, మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్, ఏఈ వినోద్, స్థానిక నాయకుడు మహేశ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రెండో వార్డులో బోరు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

స్వీపర్ కుటుంబానికి ఆర్థికసాయం

లింగంపేట(తాడ్వాయి), మార్చి 18: తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో స్వీపర్‌గా పని చేసి అనారోగ్యంతో మృతి చెందిన బట్టు రాజమణి కుటుంబానికి ఎస్సై వెంకటేశ్వర్లు చేతుల మీదుగా రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. 2014 నుంచి 2016 వరకూ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై నాగరాజు విధులు నిర్వహించిన సమయంలో రాజమణి స్వీపర్‌గా పని చేసిందని, ఇరవైరోజుల క్రితం ఆమె అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై నాగరాజు ఆమె కుటుంబానికి రూ.10వేలు పంపగా ఎస్సై అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలకు ప్రింటర్ వితరణ

గాంధారి, మార్చి 18: మండలంలోని పొతంగల్ కలాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఇదే పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన వేల్పుల గీత అనే ఉపాధ్యాయురాలు రూ.20 వేల విలువ చేసే ప్రింటర్‌ను మంగళవారం పాఠశాలకు అందజేశారు. తాను పనిచేసిన పాఠశాలకు తన వంతు సాయంగా ప్రింటర్‌ను వితరణ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం రంగారావు, గ్రామ మాజీ సర్పంచ్ వడ్ల బాలరాజు ఉపాధ్యాయురాలుకి శాలువా కప్పి సన్మానించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి రాజు

గాంధారి, మార్చి 18: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పదోతరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో రాజు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 111 మంది విద్యార్థులకు, గౌరారం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయుడు పెంటయ్య అందించిన పరీక్ష ప్యాడ్లు, పెన్నులను మంగళవారం డీఈవో చేతుల మీదుగా వితరణ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదోతరగతి వార్షిక పరీక్షలకోసం విద్యార్థులు ప్రణాళిక ప్రకారం కష్టపడి చదువుకోవాలని, పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీహరి, హెచ్ఎంలు వెంకటేశ్వర్‌గౌడ్, శ్రీనివాస్, కుమారస్వామి, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు ప్రకాశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాంధారి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు అందజేస్తున్న డీఈవో రాజు

విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్ల వితరణ..

పెద్ద కొడప్‌గల్ (పిట్లం), మార్చి 18: పిట్లం మండలంలోని గోద్మెగాం,చిల్లెర్గి ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పిట్లం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. 36 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, అవసరమైన జామెట్రీ బాక్స్‌లు అందజేశారు. చిల్లెర్గి గ్రామానికి చెందిన రాజులు సేట్ తన తండ్రి జ్ఞాపకార్థం పదోతరగతిలో మండల స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన ఐదుగురు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సిల్వర్ మెడల్స్ అందజేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కిషన్, కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి బాలు, సభ్యులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ..

లింగంపేట, మార్చి18: లింగంపేట మైనార్టీ గురుకుల పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. మండలంలోని మెంగారం గ్రామానికి చెందిన విఠల్ పాఠశాలలో చదువుతున్న 24 మంది విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు వితరణ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరాములు తదితరులు ఉన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలి

తాండూర్ పాఠశాలలోనృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

నాగిరెడ్డిపేట/పెద్దకొడప్‌గల్ (పిట్లం)/ఎల్లారెడ్డి రూరల్, మార్చి18: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతంగా ఎదగాలని తాండూర్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకట్‌రెడ్డి అన్నారు. పదోతరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, పాటలు, ఉపన్యాసాలు అలరించాయి. పిట్లం మండలంలోని రాంపూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శ్రీలత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పెద్దకొడప్‌గల్/లింగంపేట/నాగిరెడ్డిపేట, మార్చి 17 : మండలంలోని కాటేపల్లి తండా, వడ్లం గ్రామాల్లో మంగళవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. మండలంలోని కుబ్యానాయక్ తండాలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.20 లక్షల వ్యయంతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి నాయకులు మహేందర్‌రెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు మల్లప్ప పటేల్, శామప్ప పటేల్, నాగునాథ్, హైమాద్ తదితరులు పాల్గొన్నారు. లింగంపేట మండల కేంద్రంలోని బీసీ కాలనీలో సీసీ రోడ్డు పనులను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. బీసీ కాలనీలోని మూడు వార్డుల్లో 55 లక్షల రూపాయలతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారా గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజు, మండల యూత్ అధ్యక్షుడు రాజు, నాయకులు నగేశ్, వంజరి ఎల్లమయ్య, ఏదుల్, అశోక్, షాదుల్లా, ఖాసీం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని వెంకంపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా వచ్చిన రూ.15 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కిచ్చన్నపేట సింగిల్ విండో అధ్యక్షుడు గంగారెడ్డి ప్రారంభించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టరుకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు భూపాల్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, ఫీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పోచారం, వెంకంపల్లి గ్రామాల్లో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పీఆర్‌డీఈఈ గిరిధర్ పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ ఏఈ పిచ్చయ్య, జీపీ కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌కు సన్మానం

గాంధారి, మార్చి 18: గాంధారి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సతీశ్‌రెడ్డి బదిలీపై మాచారెడ్డికి వెళ్తుండగా, ఆయన స్థానంలో మాచారెడ్డి తహసీల్దార్ శ్వేత బదిలీపై గాంధారి మండలానికి రానున్నారు. బదిలీపై వెళ్తున్న సతీశ్‌రెడ్డి మంగళవారం విధుల నుంచి రిలీవ్‌కాగా ఆయనను కార్యాలయ సిబ్బంది, గాంధారి సింగిల్ విండో చైర్మన్ సాయికుమార్, మాజీ సర్పంచ్ సంజీవ్ శాలువాలు కప్పి సన్మానించారు.

లింగంపేట తహసీల్దార్ బదిలీ..

లింగంపేట, మార్చి18: లింగంపేట తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రాజానరేందర్‌గౌడ్ పిట్లం మండలానికి బదిలీపై వెళ్లినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. ఆయన స్థానంలో బిచ్కుంద తహసీల్దార్ సురేశ్ లింగంపేటకు వస్తున్నట్లు పేర్కొన్నారు.

నిజాంసాగర్ కాలువలో మృతదేహం లభ్యం

నిజాంసాగర్, మార్చి 18: కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నిజాంసాగర్ ప్రధాన కాలువలో పడి వ్యక్తి గల్లంతై చనిపోయిన ఘటన మహ్మద్‌నగర్ మండలం బూర్గుల్ గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకున్నది. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గుల్ గ్రామానికి చెందిన రామగళ్ల దశరథ్ (37) సోమవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి నిజాంసాగర్ ప్రధాన కాలువ వద్దకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతు కాగా, మంగళవారం సాయంత్రం కోమలంచ గ్రామ శివారులో శవం లభ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ట్రాక్టర్ కింద పడి యువకుడి మృతి

మద్నూర్, మార్చి 18 : మండలంలోని చిన్న ఎక్లార గ్రామంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి సాబ్దె దశరథ్ (25) మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దశరథ్ వృత్తి రీత్యా ట్రాక్టర్ డ్రైవర్. చిన్న ఎక్లార గ్రామంలో ఒకరి పంటపొలం నుంచి పక్కనే ఉన్న మరొకరి పొలానికి ట్రాక్టర్‌లో మట్టి తరలిస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. మృతుడి భార్య భాగ్యశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టు మార్టం నిర్వహించి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ..

పెద్ద కొడప్‌గల్ (పిట్లం),మార్చి 18: బట్టలు ఉతకడానికి వెళ్లి కాలుజారి ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతిచెందిన ఘటన కిష్టాపూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం...పిట్లం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన చిన్నోల సత్యవ్వ(45) మంగళవారం ఉదయం గ్రామంలో